క్లుప్తంగా

9న వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలు వేలం

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన వ్యవసాయ భూములు 2 ఎకరాల 8 గుంటలకు ఈనెల 9న ఆలయం వద్ద ఉదయం 10 :30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యరగాని గురువయ్య గౌడ్, ఈఓ ఎంపి.లక్ష్మణ్‌రావు శనివారం తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరేడుచర్ల టౌన్ 1 ఫీడర్ కింద రామాపురం, మున్సిపల్ రోడ్డు, గ్రంథాలయం విధిలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు గాను ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025- 26 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ప్రిన్సిపాల్ డి.విజయనాయక్ కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. అనంతరం అధ్యాపకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పోషకాహారం కిట్ల పంపిణీ



పోషకాహారం కిట్లు అందిస్తున్న వైద్యులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ పేషెంట్లకు వైద్యాధికారి డాక్టర్ వై.సీతామహలక్ష్మి పౌష్టికాహారం కిట్లను అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, బందెల రాములు, శ్రీనివాసరెడ్డి, రాజేష్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై శనివారం కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రెడ్డిమల్ల వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేతి ప్రసాద్ తన ఇంట్లో అనుమతి లేకుండా మంచినీటి నల్లా కనెక్షన్ ఇచ్చుకున్నాడని, అక్రమంగా కనెక్షన్ ఏర్పాటు చేయడం తప్పు అని అన్నందుకు అతనితో పాటు అతని కుటుంబ సభ్యులు తనపై, గ్రామ పంచాయతీ సిబ్బందిపై దాడి చేశారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహాన్ని బంధువులకు అప్పగింత

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని గోల్డెన్ సిటీ వెంచర్ వెనుక వైపు పొలంలో మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలియడంతో శనివారం మృతదేహాన్ని పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన దండుగుల నాగరాజు(45) గత నెల 28న మఠంపల్లి మండలం బిల్యానాయక్‌తండాలో ఉంటున్న బంధువులు ఇంటికి బయల్దేరాడు. తాగిన మైకంలో ఉన్న నాగరాజు హుజూర్‌నగర్ పట్టణంలోని గోల్డెన్ సిటీ వెంచర్ వెనుక వైపు గల పొలంలో మృతిచెంది కనిపించాడు. అతడి మరణ వార్తను కుటుంబ సభ్యులు మీడియాలో చూసి తెలుసుకున్నారు. నాగరాజు భార్య పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గరిడేపల్లి : మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నలిగంటి నరేష్, ఏఎస్‌ఐ సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెలిదండ గ్రామంలో సైబర్ నేరాలు, గంజాయి, మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన పోలీస్ కళాజాతాలో వారు మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ వివరాలు తెలుపవద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వేధింపులపై 100కు సమాచారం అందించాలని ఆయన కోరారు. కోదాడ షీ టీమ్ ఏఎస్‌ఐ కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనర్సయ్య, కవిత, సాయి జ్యోతి, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, నాగార్జున, కృష్ణ పాల్గొన్నారు.

హైవేపై పశువుల సంచారం

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

- ఇటీవల గేదె కళేబరాన్ని బైక్ ఢీకొట్టిన ఘటనలో యువతి మృతి
- పశువులను వదలవద్దని పోలీసులు హెచ్చరించినా పట్టించుకోని యజమానులు



మునగాల వద్ద జాతీయ రహదారిపై సంచరిస్తున్న పశువులు

మునగాల : మునగాల మండల పరిధిలో 65వ నంబర్ జాతీయ రహదారిపై పశువులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాలకు చెందిన పశువుల యజమానులు ప్రస్తుత వేసవిలో పశువులను మేత కోసం వదిలేస్తుండడంతో అవి హైవేపైకి వస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదవశాత్తు వాటిని ఢీకొట్టి గాయాలపాలవుతున్నారు. వాహనాలు ఢీకొట్టి వెళ్లగా పశువుల కళేబరాలు జాతీయ రహదారిపైనే ఉంటుండడంతో ద్విచక్ర వాహనదారులు వాటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. మునగాల మండల పరిధిలో ఇలాంటి సంఘటనలు ఇటీవల తరచూ జరుగుతున్నాయి. ఆకుపాముల శివారులో రహదారిపై పడి ఉన్న గేదె కళేబరాన్ని వారం రోజుల క్రితం ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో ఓ యువతి అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. రాత్రి వేళల్లో రహదారిపై పశువులు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువులను మేత కోసం బయటకు వదలవద్దని పోలీసులు పలుమార్లు హెచ్చరిస్తున్నా యజమానులు పట్టించుకోవడం లేదు. పశువులను వదలకుండా ఉంటే హైవేపై ప్రమాదాలను అరికట్టవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

యజమానులపై చర్యలు



జాతీయ రహదారి పక్కన గ్రామాలకు చెందిన పశువుల యజమానులు తమ పశువులను మేతకు వదలవద్దు. ఒకవేళ రహదారిపై పశువులు కనిపిస్తే వాటిని గుర్తించి యజమానులపై చర్యలు తీసుకుంటాం. హైవేపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ, మునగాల

ధాన్యం రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



నామవరంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మోతె : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంతో పాటు హుస్సేన్‌బాద్, మామిళ్లగూడెం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శించారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలు వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో కాంటాలు త్వరితగతిన పూర్తిచేసి ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేయాలన్నారు. ఆయన వెంట ఏపీఎం వెంకయ్య, పీఏసీఎస్ సీఈఓ అనంతరెడ్డి, సెంటర్ ఇన్‌చార్జ్‌లు శ్రీను, రామకృష్ణ, రైతులు ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం తగదు



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మోతె : ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పి ఆమేరకు రాష్ట్రంలో ఎక్కడ ఇళ్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. గ్రామ సభల్లో అర్హుల జాబితాలో శాంతాడంత లిస్టు రాసి నేడు గ్రామానికి 10 నుంచి 20 మంది పేర్లు మాత్రమే ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహారావు, మండల నాయకులు, దోసపాటి శ్రీను, సోమగాని మల్లయ్య, ఎడమ పద్మ, సుందరి అనిల్ పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం హర్షణీయం



నేరేడుచర్ల : మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి : జన గణనతో పాటు కుల గణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర బీసీ నాయకుడు ఈదుల కృష్ణయ్యయాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని దేశ వ్యాప్తంగా జన గణనలో కుల గణన చేపడతామని ప్రకటించిందని తెలిపారు. కుల గణనతో మెజార్టీగా ఉన్న బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం..

నేరేడుచర్ల : జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ శనివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీకి నేరేడుచర్లలోని ప్రధాన కేంద్రంలో బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, నర్రినాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌నాయుడు, మధు, తాళ్ల నరేందర్‌రెడ్డి, నాగయ్య, అశోక్, ఎల్లయ్య, నాగిరెడ్డి, సైదిరెడ్డి, శావయ్య, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘పది’లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



విద్యార్థినిని సన్మానిస్తున్న జనసేన నాయకులు

నేరేడుచర్ల : పదవ తరగతి ఫలితాల్లో 561 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన నేరేడుచర్లకు చెందిన కందిబండ వేద స్వరూప్‌ను శనివారం స్థానికంగా వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు గరిణె జ్యోతి, జిల్లా ఆరోగ్య శిబిరాల ఇన్‌చార్జ్ రాచకొండ శ్రీనివాస్‌రావు, డిస్ట్రిక్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, వాసవి మాత జిల్లా పారాయణం ఇన్‌చార్జ్ కందిబండ వాసంతి, జిల్లా సంప్రదాయల ఇన్‌చార్జ్ వీరవెల్లి శ్రీలత, గెల్లి లక్ష్మీనర్సింహారావు, గెల్లి లక్ష్మీప్రసన్న, నటరాజ్, గోపాలకృష్ణ, విజయ, శైలజ, ఉర్మిల, కందిబండ సురేష్, నర్మద తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నేరేడుచర్ల : పదవ తరగతి ఫలితాల్లో నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన దామరచర్ల ప్రణవి 564 మార్కులతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3వ ర్యాంకు, మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం నేరేడుచర్లలోని జనసేన పార్టీ కార్యాలయంలో విద్యార్థినిని జనసేన పార్టీ నాయకులు సత్కరించి రూ. 4 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

గరిడేపల్లి : సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు తుంబాయిగడ్డ, గుండాలమిట్టలో జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు టి.రవీందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి సాయిలు, మోహినుద్దీన్, సత్యనారాయణ, నాగేందర్, శోభన, హైమావతి, లక్ష్మీనారాయణ, సీఆర్పీ రాతికింది రామకృష్ణ పాల్గొన్నారు.

నాగేశ్వరరావు కృషి మరువలేనిది

నడిగూడెం : బీజేపీ బలోపేతానికి రౌతు వెంకటేశ్వరరావు (60) చేసిన కృషి మరువలేనిదని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బూర మల్సూర్ అన్నారు. శనివారం తెల్లబెల్లిలో నిర్వహించిన బీజేపీ సీనియర్ నాయకుడు దివంగత వెంకటేశ్వరరావు దశదిన కర్మలో ఆయన పాల్గొన్నారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రౌతు కళ్యాణ్, కోదాడ పట్టణ కోకన్వీనర్ బొలిశెట్టి కృష్ణయ్య, మండల అధ్యక్షుడు బండారు వీరబాబు, నాయకులు భిక్షం రెడ్డి, నూకపంగు గుర్వయ్య పాల్గొన్నారు.

అందుబాటులో డెడ్ బాడీ ఫ్రీజర్

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు చొరవతో గ్రామస్తులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల సహకారంతో డెడ్‌బాడీ ఫ్రీజర్ కొనుగోలు చేశారు. గ్రామంలో ఎవరైన చనిపోతే మృతదేహాన్ని కొన్ని గంటల పాటు ఉంచేందుకు ఫ్రీజర్ లేక ఇన్నాళ్లు గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. దీంతో దాతల సహకారంతో ఫ్రీజర్ కొనుగోలు చేసి, పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని, కులమతాలకు అతీతంగా గ్రామస్తులు ఫ్రీజర్‌ను సద్వినియోగం చేసుకోవచ్చని కార్యదర్శి తెలిపారు.

మండల అధ్యక్షుడిగా మేడి నాగరాజు

గరిడేపల్లి : సమాచార హక్కు రక్షణ చట్టం మండల అధ్యక్షుడిగా కాచవారిగూడెం గ్రామానికి చెందిన మేడి నాగరాజు ఎన్నికయ్యారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయనకు సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపాటి సందీప్ నియామక పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి సత్యంకు నివాళి

చిలుకూరు : బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వనపర్తి సత్యం సంతాప సభను శనివారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల చైర్మన్లు, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాములోరికి అభిషేకం



శ్రీరాముడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

నేరేడుచర్ల : శ్రీరాముడి జన్మ నక్షత్రం (పునర్వసు నక్షత్రం) సందర్భంగా శనివారం పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో శ్రీరాముడికి ఆలయ ప్రధాన అర్చకుడు ఉపేంద్రశర్మ పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం చేశారు. పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, ధర్మకర్త రాచకొండ నాగ మాధవరావు, పులిజాల వెంకటరమణరావు, కృపాకర్, జంగారావు, సుబ్బారావు, కొణతం చిన లచ్చిరెడ్డి, కుంకు శ్రీనివాస్‌రావు, వెంకన్న, వెంకట్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, రవి, భరత్ విజయలక్ష్మి, అన్నపూర్ణ, శోభ, నీలిమ, రత్తమ్మ, చైతన్య, కవిత ఉన్నారు.

సబ్ మార్కెట్ యార్డులో వసతుల కల్పనకు కృషిచేస్తా



సబ్ మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ రాధికా దేశ్‌ముఖ్

మఠంపల్లి : సబ్ మార్కెట్ యార్డులో వసతుల కల్పనకు కృషి చేస్తామని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా దేశ్‌ముఖ్ అన్నారు. మండల కేంద్రం సమీపంలో గల సబ్ మార్కెట్ యార్డును శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. అనంతరం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శేషవస్త్రాలతో చైర్మన్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కిషోర్‌రెడ్డి, నాగుల్‌మీరా, తులసీరాంనాయక్, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ నవీన్, గురువయ్య, నరసింహారావు, వీరన్న, మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

చిలుకూరు : మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి చిలువేరు ఆంజనేయులు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కడారు మధు, సీపీఐ నాయకులు పిల్లుట్ల కనకయ్య, ముక్కా లక్ష్మీనారాయణ, బాలేబోయిన రాంబాబు, సుల్తాన్ వెంకటేశ్వర్లు, బాలేబోయిన రవి, కాశయ్య, మహేష్, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

గాలిదుమారానికి విరిగిన 150 ఏళ్ల నాటి వృక్షం కొమ్మ



గోపాలపురంలో విరిగిన చెట్టు కొమ్మ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో గ్రామ నడిబొడ్డున ముత్యాలమ్మ గుడి వద్ద గల 150 ఏళ్ల నాటి వేపచెట్టు భారీ కొమ్మ శనివారం గాలిదుమారానికి విరిగింది. కొమ్మ విరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి

చిలుకూరు : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ బండ ధరను వెంటనే తగ్గించాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవర మల్లేశ్వరి కోరారు. శనివారం మండలంలోని సీతరాంపురంలో జరిగిన మహిళా సమాఖ్య గ్రామ శాఖ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా లక్ష్మి, కార్యదర్శిగా గుండు రాజ్యలక్ష్మి, సహాయ కార్యదర్శిగా వట్టెపు మరియమ్మ, ఉపాధ్యక్షులుగా సాలెమ్మ, నాగమ్మ, కోశాధికారిగా స్వరూపను ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి సాతులూరి అలివేలు, నాయకురాళ్లు కవిత, కావ్య, అంజలి, రాములమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

అమాత్యా నా మొర ఆలకించరూ !



మీ ఆశీస్సులతో పెరిగి పెద్దదానిగా మారుతున్న కోదాడ ప్రభుత్వ వైద్యశాల

గౌరవనీయులైన రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గారికి నమస్కారాలు...

నేను కోదాడ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను. అనారోగ్యానికి గురైన సామాన్యులకు స్వస్థత చేకూర్చడానికి ఆరు దశాబ్దాల క్రితం దాతలు ఇచ్చిన రెండు ఎకరాల స్థలంలో నన్ను ఏర్పాటు చేశారు. పట్టణం నలుమూలల విస్తరించినా నేను మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాను. 30 వేల నుంచి 80 వేల సంఖ్య వరకు పెరిగిన నా బిడ్డలకు కనీస వైద్య సేవలు అందించలేకపోతున్నాననే బాధ నాకు ఉంది.

మీరు కోదాడ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నన్ను పట్టించుకున్నారు. నా స్థాయిని పీహెచ్‌సీ నుంచి 30 పడకలకు పెంచారు. నాకు కొత్త భవనం కూడా కట్టించారు. చాలా ఆనందమేసింది. అప్పటి నుంచి నేను చేతనైన స్థాయిలో పేద బిడ్డలకు వైద్యసేవలందిస్తూనే ఉన్నాను. కానీ నాకు కష్టాలొచ్చాయి. దాతల దాతృత్వానికి గండి కొడుతూ కొందరు నా ప్రహరీ లోపల ఉన్న స్థలాన్ని కాజేయడానికి నానా రకాలు కేసులు వేశారు. మంచి మనసున్న కొందరు అధికారులు దాన్ని అడ్డుకోగా.. మరి కొందరు కాసులకు కక్కుర్తి పడి నాలో కొంత భాగాన్ని కోసి అప్పగించారు. దాని కోసం వయస్సును కూడా లెక్క చేయకుండా కొందరు వృద్ధులు పదిహేను సంవత్సరాలుగా పోరాడుతున్నా ఎవ్వరికీ కనికరం కలగడం లేదు. రెండు రోజుల క్రితం మంటుటెండలో కలెక్టరేట్ వద్ద నిరసన చేసినా ఫలితం లేకుండా పోయింది.

గతంలో నన్ను అభివృద్ధి చేసిన మీరు మరోసారి రాష్ట్ర అమాత్యులు కావడంతో నాకు మళ్లీ మంచి రోజులొచ్చాయని సంతోష పడుతున్నాను. అనుకున్నట్లే మీరు నా స్థాయిని 30 పడకల నుంచి 100 పడకలకు పెంచడమే కాకుండా నా కోసం రూ.26 కోట్లతో కొత్త భవనం కట్టించడానికి కృషి చేస్తుండడం ఆనందం కలిగిస్తోంది.

అమాత్యా ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకురావాలనిపించింది. అనేక రోజులుగా ఎదురు చూస్తున్నాను. ఈ రోజు మీరు నా వద్దకు వస్తున్నారని తెలిసి నా బాధను మీ చెవిలో వేద్దామని నా ఈ చిన్న ఆరాటం. అయ్యా.. దాత నా కోసం 2 ఎకరాల స్థలాన్ని దానం ఇవ్వగా కాకి లెక్కల తకరారుతో మీ అధికారులు ప్రస్తుతం నా కాంపౌండ్ లోపల కేవలం ఎకరం ఇరవై ఐదు గుంటలు మాత్రమే ఉందని ఇటీవల తేల్చారు. మిగిలిన 15 గుంటలు ఆక్రమణకు గురైనా పట్టించుకోవడం లేదు.

మంచి మనస్సున్న మీరు ఈ ఆక్రమణల విషయంలో విచారణ జరిపించి నా దేహం నుంచి కోసి ఇచ్చిన భాగాన్ని నాకు కలపాలని అర్థిస్తున్నా. వీరు ఎంతో వ్యయప్రయాసాల కోర్చి నన్ను 100 పడకల స్థాయికి నన్ను పెంచాలనే మీ ప్రయత్నానికి ఈ స్థల సమస్య అడ్డంకిగా మారే అవకాశం ఉంది. ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకొని 2 ఎకరాల్లో వంద పడకల వైద్యశాల నిర్మాణం మీరు పూర్తి చేయిస్తే కోదాడ చరిత్రలో మీ పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది. ఈ విషయంలో మీరు మీ బిడ్డగా చూసుకొనే నా కోసం నా ఈ విన్నపాన్ని మన్నిస్తారనే పూర్తి విశ్వాసంతో... సెలవు తీసుకుంటున్నాను. నేటి మీ రాకకోసం వెయ్యి కన్నులతో ఎదురు చూస్తుంటాను.

కార్మికుల పక్షాన ఐఎన్‌టీయూసీ పోరాటం



కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, మహిళా నాయకులు

హుజూర్‌నగర్ : కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐఎన్‌టీయూసీ పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, మహిళా కార్మికులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్ సూచనలతో ప్రభుత్వ రంగ కార్మిక యూనియన్, ప్రైవేట్ పరిశ్రమలలో అసంఘటిత రంగాలలో ఐఎన్‌టీయూసీ అనుబంధ యూనియన్లను ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య, నాయకులు మేళ్లచెరువు ముక్కంటి, పాశం రామరాజు యాదవ్, సలిగంటి జానయ్య, యోహాన్, షేక్ జాన్ సైదా, కస్తాల దిల్, లలిత, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

నేరేడుచర్ల : పట్టణంలో శనివారం మేడే వేడుకలను ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు శ్రీను జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మచ్చ శ్రీను, ఖాదర్ బాయి, నాగయ్య, ఎస్‌కె ఇస్తియాక్, మాజీ ఎంపీటీసీ శ్రీరాములు, నర్సిరెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, సుఖేందర్, వీరబాబు, సైదులు, చిన మల్లయ్య, ఆదిరెడ్డి, పున్నయ్య, శ్రవణ్, కార్మిక సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



హుజూర్‌నగర్ : చిన్నారుల బరువు చూస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గరిడేపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ కటకం ఉమ, విమలమ్మ అన్నారు. శనివారం మండలంలోని పొనుగోడులోని అంగన్‌వాడీ కేంద్రం- 5లో నిర్వహించిన వీహెచ్ఎస్ఎన్‌డీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఏఎన్‌ఎంలు రజియా, రవళి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ అభియాన్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో గల రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, తల్లులకు, గర్భిణులకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. పిల్లల బరువును కొలిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సత్యావతి, ఆశా వలంటీర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బాలామృతం ప్లస్

హుజూర్‌నగర్ : వయస్సుకు తగ్గ బరువు లేకున్నా, అతి తక్కువ బరువు ఉన్న చిన్నారులకు బాలామృతం ప్లస్ ఇస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని 15వ వార్డులో విలేజ్ హెల్త్ శానిటేషన్, న్యూట్రీషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 ఏళ్ల లోపు పిల్లల బరువులు నమోదు చేశారు. గర్భిణులు, బాలింతల బరువు, ఎత్తు నమోదు చేశారు. అంగన్‌వాడీ టీచర్ ఇట్టిమల్ల రేణుక, వార్డు ఆఫీసర్ రవికుమార్, ఆశ హేమలత, ఆర్‌పి శ్రీదేవి, దగ్గుపాటి జీవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



కీసర సంతోష్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు

మోతె : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు సంతోష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యకర్తలు, స్నేహితులు ఆయనకు గజమాలతో సన్మానించారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ఎలుగు వీరన్న, గునగంటి నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచాలి



బాల విజ్ఞాన మేళా ప్రారంభోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

కోదాడ : విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్, జనవిజ్ఞాన వేదిక సభ్యులు కోరారు. శనివారం కోదాడ బాలుర పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, కోదాడ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల విజ్ఞాన మేళాను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 15 వరకు బాల విజ్ఞాన మేళా ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, జాఫర్, బడుగుల సైదులు, బాలుర పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మార్కెండేయులు, బొల్లు రాంబాబు, రామనర్సయ్య, నారపరెడ్డి, ఖాజామియా, ఆంజనేయులు, సత్యప్రసాద్ పాల్గొన్నారు.